
ముత్యాలవాన:

# ఊరు-అడవి

పొట్లపల్లి రామారావు




బ్రహ్మాండంగా మండుతోంది ఎండ.

గడ్డిపోచ లేకుండా మాడి రుద్రభూమివోలె కనిపిస్తున్నది నేల. నిప్పులా మండుతున్న ఎండలో నుంచి నడిచిపోతున్నాను. నా శరీరంలోని సర్వశక్తులను ఎండ ఓడ్చివేసింది. దాహ బాధకు శరీరమంతా నీరసంగా ఉంది. ఎక్కడ నీరు జాడ కనుపించడం లేదు, దప్పి తప్ప నాకు.

''ఎంత కోపముంది''

వేరే సంగతి స్మృతిలో లేదు. దూరాన పచ్చచెట్ల క్రింద ఓ ఊరు కనుపించింది. పచ్చని చెట్లను, మనుష్యుల ఇళ్లను చూడటం తోనే నీరు త్రాగినట్టె కొత్త ప్రాణం వచ్చింది నాకు. ఊళ్ళోకి పోయి ఒక ఇంటి ముందు ఆగి ''దాహం'' అని అరిచాను.

''ఏ ఊరు మీది?''

మొదలు మొదలు అడిగాడు ఆయన దాహము కన్నా అది ముఖ్యావసరమైనట్లు. దాహ బాధతో ఊరు, పేరు చెప్పబుద్ధిపుట్టలేదు నాకు. నేను మాట్లాడలేదు.

ఆయన అట్లాగే నిలబడ్డాడు. పేరు చెప్పంది నీళ్ళు పోయనన్నట్లు. ఆయన అట్లా నిలబడడం నాకు బాగుండలేదు. కొంచెం సేపు నిలబడి ఇంకొక ఇంటికి పోయాను.

''ఎవరు మీరు?''

మళ్ళీ అదే ప్రశ్న.

మళ్ళీ అదే ప్రశ్న వినడం నాకు బాగనిపించలేదు. కొంచం కోపం వచ్చింది.

''నాకు దాహం వేస్తోంది'' అన్నాను.

''ఎవరంటె మాట్లాడరెందుకు?''

''ఎవరైతే ఏమిటయ్యా... దాహము ఇయ్యటానికి?''

''ఎవరైంది చెప్పకూడదా?''

''దాహానికి ఎవరైతే ఏమిటి?''

''ఎవరని అడిగితే ఇంత బాధ ఏమిటయ్యా?''

అక్కణ్ణించి ఇంకో ఇంటికి పోయాను.

''మీ పేరేమిటి?''

మళ్ళీ అదే ప్రశ్న. నాకు మరీ కోపం వచ్చింది.

''ఎవరైతే ఏముంది?''

''కాదు ఏమి పేరు?''

''ఏదో ఒక పేరు''

''ఏమిటయ్యా... చెబుదూ?''

''అబ్బా! పేరు! పేరు! ఏ పేరైతే ఏముంది?''

''అంత విసుగు ఎందుకయ్యా?''

''నీరు నీరు అని ప్రాణాలు వదులుతున్న వాణ్ణి పేరు-పేరు! అని ఏడ్పిస్తారేమిటి?''

కోపంతో ఊరు దాటిపోయాను. ఊరు దాటిన వెనుక, నా తెలివితక్కువతనము, తొందరపాటు మీద నాకు కోపము వచ్చింది. ఎందుకంటె ఊరు పోయి అడవి వచ్చింది. అడవిలో నీళ్ళు ఎక్కడ దొరుకుతాయి? ఊరు పేరు అక్కరలేకున్న పొదలు, తీగెలు నీళ్ళు ఇచ్చేవి కావు. ఏమి చేయాలో నాకేమి తోచ లేదు. పిచ్చివాడి మోస్తరు అట్లాగే పోతున్నాను. నా శరీరం నా వశం తప్పదొడగింది. నా కాళ్ళు తడబడదొడగాయి. మృత్యువు ముంచుకొస్తున్నట్లు కళ్ళు చీకట్లు క్రమ్మదొడగాయి. దాహముతో అడవి మధ్య చచ్చిపోతానేమో అని భయం వేయదొడగింది. ఇంతలో హఠాత్తుగా ఓ చిన్నవాగు ఎదురైంది. నా విగత జీవాలు వాగు రూపంలో ప్రత్యక్షమైనట్లు పొంగిపోయాను.

వాగులో బాటసారులు ఓ చెలమతోడి ఉంచారు. చెలమలోకి తలవంచి అమృతము త్రాగినట్లు ఆ నీరంతా త్రాగేశాను. దాహానికి నీరు దొరికినందుకు నాకు ఎంతో ఆనందమైంది. నీరు తాగుతూ తాగుతూ నాకు ప్రాణదానం చేసిన ఆ మూగతల్లికి కోటి నమస్కారాలు చేశాను.

కాని అన్నిటికన్నా నాకు మహా ఆనందం కలిగించిన విషయమేమిటంటే, ఆ చెలమ నా ఊరు పేరు గూర్చి ప్రశ్నలు వేయలేదని, ఇది ఏదో అసాధారణ విషయమని నాలో నేను అలౌకికానందంతో పొంగిపోయాను.

(రచన- సెప్టెంబర్ 1953; సేకరణ- దేవరాజు మహా రాజు)